క్లుప్తంగా

పొట్టి శ్రీరాములుకు ఘన నివాళి



పొట్టి శ్రీరాములు చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న జీవీఎంసీ అధికారులు

డాబాగార్డెన్స్: జీవీఎంసీ 36వ వార్డు రంగిరీజు వీధిలో గల బాలల శాఖా గ్రంథాలయంలో ఆదివారం పొట్టి శ్రీరాములు వర్ధంతి నిర్వహించారు. గ్రంథాలయ సీనియర్ పాఠకుడు సీహెచ్ రామకృష్ణ పొట్టి శ్రీరాములు చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన జీవిత చరిత్ర గురించి పిల్లలకు వివరించారు. విద్యార్థులకు కథల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. గ్రంథాలయ అధికారి టి. పోలితల్లి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పాఠకులు వి. మధుసూదనరావు, ఎస్. నవీన్, వై. పద్మ, అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో..

ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటుకు ఆమరణ నిరాహార దీక్ష చేసి, ప్రాణాలర్పించిన అమరజీవి పొట్టి శ్రీరాములు చిరస్మరణీయుడని జీవీఎంసీ అదనపు కమిషనర్ డీవీ రమణమూర్తి పేర్కొన్నారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో ఆదివారం జీవీఎంసీ అధికారులు, ఉద్యోగులతో కలిసి పొట్టి శ్రీరాములు వర్ధంతిని పురస్కరించుకుని నివాళులర్పించారు. ఈ సందర్భంగా అదనపు కమిషనర్ మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు భారతీయ స్వాతంత్ర్య సమరయోధుడు, అమరజీవిగా గౌరవించబడ్డారన్నారు. సామాజిక న్యాయం కోసం కృషి చేశారన్నారు. కార్యక్రమంలో జోన్–2 జోనల్ కమిషనర్ ఎంపీడీ ఫణిరామ్, పరిపాలనాధికారి అప్పలనాయుడు, సహాయ ఇంజినీర్ ఆనంద్, పర్యవేక్షకులు రియాజ్, అప్పలరాజు, ఉద్యోగులు పాల్గొన్నారు.



రంగిరీజు వీధి శాఖా గ్రంథాలయంలో పొట్టి శ్రీరాములుకు పాఠకుల నివాళి

ప్రోటోకాల్, వీవీఐపీ దర్శనాలు పోలీసుల పరిధిలో లేవు

డాబాగార్డెన్స్: ప్రోటోకాల్, వీవీఐపీ దర్శనాలు పోలీసుల పరిధిలో లేవని హార్బర్ డివిజన్ ఏసీపీ కాళిదాస్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 'ఎవరైనా మా తర్వాతే' పేరిట సాక్షిలో ప్రచురించిన కథనానికి వివరణ ఇచ్చారు. గుడి తాళాలు, చెవులు పోలీసుల వద్ద ఉండవని, పోలీసు కుటుంబ సభ్యులకు నేరుగా, లేదా పక్కదారిలో దర్శనానికి తీసుకెళ్లే అవకాశం లేదన్నారు. అలాగే వన్‌టౌన్ సీఐకు ఆదేశాలు, సలహాలు, సూచనలు మాత్రమే ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఎటువంటి అసహనం వెళ్లబుచ్చలేదని, అధికారిగా భక్తులకు ఎటువంటి అడ్డంకులు, ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించినట్లు తెలిపారు.

ఎంఎస్ఎంఈ రుణాలతో వ్యాపార విస్తరణ

డాబాగార్డెన్స్: మైక్రో, చిన్న, మధ్య తరహా ఎంటర్‌ప్రైజెస్ రుణాలు చిన్న వ్యాపారాల అభివృద్ధికి తోడ్పడతాయని, ఈ రుణాలు వ్యాపార విస్తరణ, నిర్వహణ ఖర్చులు, ఇతర ఆర్థిక అవసరాలకు అవసరమైన నిధుల్ని అందిస్తాయని, వీటిని చిన్న తరహా వ్యాపారులు ఉపయోగించుకోవాలని ఎంఎస్ఎంఈ అసిస్టెంట్ డైరెక్టర్ చంద్రమౌళి పేర్కొన్నారు. నగరంలోని రీడింగ్ రూమ్ ప్రాంతంలో గల వాసవీ కల్యాణ మండప సంఘం, వాసవీ చైతన్య ఫౌండేషన్, భారత ప్రభుత్వ ఎంఎస్ఎంఈ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో కెనరా బ్యాంక్ ద్వారా ఏర్పాటు చేసిన లోన్ మేళాలో ఆ బ్యాంక్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ మధుసూదన్‌రెడ్డి మాట్లాడారు. చిన్న తరహా వ్యాపారులకు భారత ప్రభుత్వం అందిస్తున్న వివిధ రకాల లోన్లు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వాసవీ కల్యాణ మండపం అధ్యక్షుడు విన్నకోట రామమూర్తి, వాసవీ చైతన్య ఫౌండేషన్ కార్యదర్శి కె. ప్రవీణ్‌కుమార్, సంఘం కార్యదర్శి బంగారు శెట్టి, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఆకతాయిలకు అడ్డాగా.. కల్యాణ మండపం



కల్యాణ మండపంలో పేరుకుపోయిన బీరు, మద్యం సీసాలు

- అసాంఘిక కార్యకలాపాలకు నెలవు
- మందుబాబుల హల్‌చల్
- తక్షణం నిర్మాణం పూర్తి చేయాలని స్థానికుల డిమాండ్



కల్యాణ మండపంలో తాత్కాలిక నిర్మాణం

అల్లిపురం: కొబ్బరితోట దరి అచ్చియ్యమ్మపేటలో నిర్మాణంలో ఉన్న కల్యాణ మండపం ఆకతాయిలకు అడ్డాగా మారింది. ఈ కల్యాణ మండపం నిర్మాణం ఎప్పటికి పూర్తవుతుందో తెలియదు. ఖాళీగా ఉన్న ఆ ప్రాంగణం అసాంఘిక కార్యకలాపాలకు నెలవుగా మారడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కొందరు ఆ ప్రాంగణంలో పట్టపగలే మద్యం సేవిస్తున్నట్లు తెలుస్తోంది. రాత్రి సమయాల్లో అసాంఘిక కార్యకలాపాలు, మందుబాబుల హల్‌చల్ సర్వసాధారణంగా మారినట్లు స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం అక్కడ దర్శనమిచ్చే మందుబాటిళ్లే ఇందుకు నిదర్శనమని వారు మండిపడుతున్నారు.

పోలీసు నిఘా అవసరం..

వార్డు ప్రజల శుభ, అశుభ కార్యక్రమాల నిర్వహణకు సుమారు రూ.కోటితో రెండంతస్తుల కల్యాణ మండపం నిర్మిస్తున్నారు. ఈ మేరకు 34వ వార్డు కార్పొరేటర్ తోట పద్మావతి జీవీఎంసీ నుంచి నిధులు మంజూరు చేయించారు. ఎన్నికలకు ముందు కల్యాణ మండపం నిర్మాణం జోరుగా సాగింది. ఎన్నికల సమయంలో ఎలక్షన్ నిర్వహణకు తాత్కాలికంగా గోడలు నిర్మించారు. ఆ తర్వాత వాటిని తొలగించాల్సి ఉన్నా తొలగించలేదు. దీనిని ఆకతాయిలు అవకాశంగా మలుచుకున్నారు. వాచ్‌మెన్ లేకపోవటంతో రాత్రీ పగలు ఇష్టానుసారంగా దాన్ని వాడుకుంటున్నారు. కల్యాణ మండపం ఆవరణలో ఎక్కడ పడితే అక్కడ బీరు, మందు సీసాలు కుప్పలు కుప్పలుగా పడి కనిపిస్తున్నాయి. పోలీసులు నిఘా పెట్టాలని స్థానికులు కోరుతున్నారు.

> రాత్రయితే చాలు అక్కడ మందుబాబులు చిందులేస్తారు. అసాంఘిక కార్యకలాపాలకు అడ్డూ అదుపూ ఉండదు. తాత్కాలికంగా నిర్మించిన ఆ గోడల మధ్య ఏం జరిగినా పట్టించుకునే వారు లేరు. అదీ నగర నడిబొడ్డున ఇలా జరుగుతుండడం ఆశ్చర్యం కలిగించక మానదు. ఆ ప్రాంతంలో ఎక్కడ చూసినా మద్యం సీసాలే కనిపిస్తాయి. దీంతో స్థానికులు నానా ఇబ్బందులు పడుతున్నారు.



కొబ్బరితోట దరి నిర్మాణంలో ఉన్న కల్యాణ మండపం

ఆకతాయిలతో స్థానికులకు ఇబ్బంది..



కల్యాణ మండపం నిర్మాణం త్వరగా పూర్తి చేయాలి. రెండు సంవత్సరాల క్రితం నిర్మాణం ప్రారంభించారు. ఎన్నికల వల్ల అర్ధంతరంగా నిలిచిపోయింది. నిధులు ఉన్నప్పటికీ పనులు నెమ్మదించాయి. త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలి. ఆకతాయిల వల్ల స్థానికులు ఇబ్బంది పడుతున్నారు.

– గుడివాడ శ్రీను, కొబ్బరితోట

పోలీసు గస్తీ తప్పనిసరి..



నిర్మాణంలో ఉన్న కల్యాణ మండపంలోకి ఆకతాయిలు వెళ్లకుండా చూడాలి. పోలీసులు రాత్రి సమయాల్లో పరిశీలించాలి. నిరంతరం నిఘా ఉంటే అసాంఘిక కార్యకలాపాలకు అవకాశం ఉండదు. కల్యాణ మండపం త్వరగా నిర్మించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలి. సంబంధిత అధికారులు చొరవ తీసుకుని పనులు పూర్తి చేయాలి.

– లింగం శ్రీనివాసరావు, 34వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకుడు

త్వరలోనే అందుబాటులోకి..



కల్యాణ మండపం పనులు జరుగుతున్నాయి. ఎలక్షన్ల నిర్వహణ నిమిత్తం తాత్కాలికంగా నిర్మాణాలు చేపట్టారు. త్వరలోనే వాటిని తొలగించి నిర్మాణం పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తాం. అక్కడ జరుగుతున్న అసాంఘిక కార్యకలాపాల గురించి సమాచారం వచ్చింది. జీవీఎంసీ అధికారులకు తెలియజేసాం. నిర్మాణం త్వరగా పూర్తి చేయాలని కోరాం

– తోట పద్మావతి, 34వ వార్డు కార్పొరేటర్

ఘనంగా మన్యుసూక్త హోమం



ఆంజనేయస్వామి దేవాలయంలో హోమం నిర్వహిస్తున్న దృశ్యం

మహారాణిపేట: మెయిన్ రోడ్డులో ఉన్న శ్రీ ఆంజనేయస్వామి వారి దేవాలయంలో మార్గశిర పౌర్ణమిని పురస్కరించుకుని ఆదివారం మన్యుసూక్త హోమం ఘనంగా జరిగినట్లు దేవస్థానం ఈవో అల్లు జగన్నాథం ఒక ప్రకటనలో తెలిపారు. నరఘోష, శత్రుఘోష, రుణబాధ, గ్రహదోష శాంతి కోసం స్వామి వారిని పూజిస్తే మంచి ఫలితం ఉంటుందని తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఈ హోమం నిర్వహించారు. భక్తులు రూ. 516 దేవస్థానం కౌంటర్‌లో చెల్లించి హోమంలో పాల్గొన్నారు. అనంతరం స్వామి వారి తీర్థ ప్రసాదాలు వారికి అందజేశారు.

కనకమహాలక్ష్మి అమ్మవారిని దర్శించుకున్న మంత్రి ఆనం



పట్టువస్త్రాలు తీసుకొస్తున్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి. చిత్రంలో దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ, ఆలయ ఈవో శోభారాణి

డాబాగార్డెన్స్: దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారిని ఆదివారం దర్శించుకున్నారు. విశాఖ విచ్చేసిన మంత్రికి ఆలయ సాంప్రదాయం ప్రకారం పూర్ణకుంభ స్వాగతం పలికి, అమ్మవారికి విశేష పూజలు చేయించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం తరఫున మంత్రి పట్టు వస్త్రాలు సమర్పించారు. వేద ఆశీర్వచనం అనంతరం ఆలయ ఈవో కె. శోభారాణి అమ్మవారి ప్రసాదం మంత్రికి అందజేశారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ, ఆలయ ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, వేద పండితులు, అర్చకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మి అమ్మవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు



విశేష అలంకరణలో కనకమహాలక్ష్మి అమ్మవారు

డాబాగార్డెన్స్: మార్గశిర మాసోత్సవాల 14వ రోజు ఆదివారం కనకమహాలక్ష్మి అమ్మవారిని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. విశాఖ జిల్లా నలుమూలల నుంచే కాక ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి మొక్కులు సమర్పించుకున్నారు. అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. ఉదయం 5 నుంచి పంచామృతాభిషేకం, క్షీరాభిషేకం, ప్రత్యేక హోమాలు, సహస్ర నామార్చన, సర్వదర్శనం, మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు సర్వదర్శనం, 6 నుంచి 7 గంటల వరకు విశేష పంచామృతాభిషేకం, అష్టోత్తర నామార్చన పూజ నిర్వహించారు. సహస్ర తులసీదళార్చనలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు.

త్రికాల పంచామృతాభిషేక సేవలో..

అమ్మవారి త్రికాల పంచామృతాభిషేక సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. మధ్యాహ్నం టౌన్‌కొత్తరోడ్డు సమీపాన గల జగన్నాథస్వామి ఆలయంలో 1500 మంది భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శోభారాణి, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, వేద పండితులు, అర్చకులు, సిబ్బంది, భక్తులు తదతరులు పాల్గొన్నారు.

ముగిసిన ఘంటసాల గానోత్సవాలు



పోలీస్ కమిషనర్‌ను సత్కరిస్తున్న ఘంటసాల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ సభ్యులు

డాబాగార్డెన్స్: అమర గాయకుడు ఘంటసాల 102వ జయంతి సందర్భంగా అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఘంటసాల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించిన ఘంటసాల గానోత్సవాలు ఆదివారంతో ముగిసాయి. కార్యక్రమంలో పాల్గొన్న నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ మాట్లాడుతూ ఘంటసాల గీతాలు అందరి హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయన్నారు. గాయకులను ఘనంగా సత్కరించారు. అసోసియేషన్ వ్యవస్థాపక కార్యదర్శి చెన్నా తిరుమలరావు నేతృత్వం వహించిన కార్యక్రమంలో పైడా విద్యా సంస్థల అధినేత పైడా కృష్ణప్రసాద్, సంస్థ గౌరవ అధ్యక్షుడు కొణతాల రాజు తదితరులు పాల్గొన్నారు. అనంతరం నగర సీపీని నిర్వాహకులు ఘనంగా సత్కరించారు.

అలరించిన ఘంటసాల గానోత్సవాలు..

ముందుగా జరిగిన సంగీత విభావరిలో బంగార్రాజు, భాగ్యలక్ష్మి, విశ్వప్రసాద్, కోమలి, రామ నరసింహం పాడిన తెల్లవారనీకు ఈరేయిని వంటి గీతాలు ఆకట్టుకున్నాయి. వీరితో పాటు వీరేంద్ర, షాను బొమ్మిడి సత్యనారాయణ, రాము, మనోహర్ తదితరులు ఘంటసాల గీతాలు చక్కగా ఆలపించారు. సోమేష్ సంగీత సారథ్యంలో జరిగిన విభావరికి మధుపాడ రమణి వ్యాఖ్యాతగా వ్యవహరించారు.

నరవ ప్రకాశరావుకు సత్కారం



నరవ ప్రకాశరావును సత్కరిస్తున్న అతిథులు

డాబాగార్డెన్స్: భీమవరం యూత్ హాస్టల్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (వైహెచ్ఏఐ) సంస్థ 35 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భాన్ని పురస్కరించుకుని ఆదివారం భీమవరం త్యాగరాజు భవన్ హాల్లో నిర్వహించిన కార్యక్రమంలో యూత్ హాస్టల్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర శాఖకు వ్యవస్థాపక కార్యదర్శిగా వ్యవహరించి, సంస్థ అభివృద్ధికి కృషి చేసినందుకు గాను నరవ ప్రకాశరావును ఘనంగా సత్కరించారు. వైహెచ్ఏఐ జాతీయ చైర్మన్ మనోజ్ జహరి ఆయన సేవలను కొనియాడారు.

వీఆర్‌వోల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న వీఆర్‌వో సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకట అప్పారావు

మహారాణిపేట: తాము ఎదుర్కొంటున్న సమస్యలపై కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం సమర్పిస్తున్నట్లు వీఆర్‌వో సంఘం జిల్లా అధ్యక్షుడు పోతిన వెంకట అప్పారావు తెలిపారు. ఆదివారం టర్నర్ సత్రం ఆవరణలో జిల్లా గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం సర్వ సభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన పీవీ అప్పారావు మాట్లాడుతూ గ్రామ రెవెన్యూ అధికారులపై పని వత్తిడి ఎక్కువగా ఉందని, దీన్ని తగ్గించాల్సిన అవసరం ఉందన్నారు. అలాగే అర్హత కలిగిన వీఆర్‌వోలకు పదోన్నతులు కల్పించాలన్నారు. గ్రేడ్–2 వీఆర్‌వోలకు పదోన్నతులు కల్పించే అధికారం తహసీల్దార్లకు ఇవ్వాలని అన్నారు. ఈ సమస్యలతో పాటు వీఆర్‌వోలు ఎదుర్కొంటున్న ఇతర సమస్యలపై కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం ఇస్తున్నామన్నారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి జి.దేవరాజ్, విశాఖ, భీమిలి డివిజన్ల కార్యవర్గం, జిల్లాలో గల 11 మండలాల గ్రామ రెవెన్యూ అధికారులు హాజరయ్యారు.

మద్యం దుకాణం వ్యతిరేకిస్తూ వినతి



ఎంపీ విజయసాయిరెడ్డిని కలిసిన కోడిగుడ్ల శ్రీధర్

కంచరపాలెం: నగరానికి ఆదివారం విచ్చేసిన రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర రీజినల్ కో–ఆర్డినేటర్ వి.విజయసాయిరెడ్డికి జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం పరిధిలో సమస్యలపై వార్డు కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ నేతృత్వంలో వార్డు వైఎస్సార్‌సీపీ క్లస్టర్ ఇన్‌చార్జి కోడిగుడ్ల శ్రీధర్ మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. వార్డులో గత ఆరేళ్ల నుంచి మద్యం దుకాణాలు లేకుండా ఎంతో కృషి చేశామని, కూటమి ప్రభుత్వంలో మద్యం దుకాణాలు ఏర్పాటు చేసేందుకు సిద్ధమవుతున్నారని తెలిపారు. దీనిని వ్యతిరేకించేలా వార్డులో ప్రజలు ఉద్యమిస్తున్నారని, దీనికి సహకరించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.

మార్గశిర ఉత్సవాలకు అన్నవరం ఆలయ సిబ్బంది

డాబాగార్డెన్స్: మార్గశిర ఉత్సవాలను పురస్కరించుకుని వివిధ దేవాలయాలు, దేవదాయ శాఖలో విధులు నిర్వర్తిస్తున్న పలువురు సిబ్బందిని కనకమహాలక్ష్మి ఆలయంలో విధులు నిర్వర్తించేందుకు నియమించారు. మార్గశిర ఉత్సవాల కోసం 10 మంది సిబ్బందిని అన్నవరం వీర వెంకట సత్యనారాయణస్వామి దేవస్థానం నుంచి డిప్యూట్ చేయాలని ఆ శాఖ కమిషనర్‌కు ఆలయ ఈవో కె. శోభారాణి లేఖ పంపారు. ఈ నెల 18 నుంచి 30 వరకు అన్నవరం దేవస్థానం సిబ్బందిని డిప్యూట్ చేయాలని ఆ వినతిలో పేర్కొన్నారు.

చిరస్మరణీయుడు 'మారెడ్ల'

డాబాగార్డెన్స్: ప్రేమసమాజం వ్యవస్థాపకుడు మారెడ్ల సత్యనారాయణ చిరస్మరణీయుడని ప్రేమ సమాజం కమిటీ కార్యదర్శి కె. హరి మోహన్‌రావు, కార్యవర్గ సభ్యులు కొనియాడారు. మారెడ్ల వర్ధంతి ఆదివారం ప్రేమసమాజంలో గల స్థాపకుల మందిరంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రేమసమాజం సంయుక్త కార్యదర్శి వీకే సురేష్‌కుమార్ నేతృత్వంలో ఆశ్రమవాసులు, బాల బాలికలు, కార్యవర్గ సభ్యులు పి. గణపతిరావు, డి. సింహాచలం తదితరులు ప్రభాతభేరి నిర్వహించారు. అనంతరం కోశాధికారి ఎంవీవీకే గుప్త దంపతుల చేతుల మీదుగా పూజా కార్యక్రమం జరిపారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో కార్యదర్శి హరి మోహన్‌రావు మాట్లాడుతూ నిరాశ్రయులైన వారికి ఆశ్రయం కల్పించాలని మానవత్వంతో ప్రేమసమాజాన్ని స్థాపించిన మారెడ్ల సత్యనారాయణ ఆదర్శ మూర్తిగా నిలిచారన్నారు. సలహాదారుడు డాక్టర్ పి. విశ్వేశ్వరరావు మాట్లాడుతూ ప్రేమ సమాజం ఉన్నంత కాలం మారెడ్ల పేరు చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు. ప్రతి ఒక్కరూ మారెడ్లను ఆదర్శంగా తీసుకుని జీవించాలన్నారు. శరణాలయాలు లేని రోజుల్లో విశాఖపట్నంలో ప్రేమసమాజాన్ని స్థాపించి మారెడ్ల సత్యనారాయణ ధన్యజీవులయ్యారని పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు ఉప్పల భాస్కరరావు, ఎస్. అప్పలరాజు, ఆశ్రమవాసులు, పూర్వ ఆశ్రమవాసులు తదితరులు పాల్గొన్నారు.

సత్యనారాయణస్వామికి పౌర్ణమి పూజలు



సత్యనారాయణ స్వామి

డాబాగార్డెన్స్: ఇసుకకొండ (బాబాజీ కొండ)పై వెలసిన శ్రీరమా సహిత సత్యనారాయణస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. మార్గశిర మాస పౌర్ణమిని పురస్కరించుకుని పెద్ద ఎత్తున పూజలు నిర్వహించారు. నగరం, జిల్లా నలుమూలల నుంచే కాక ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి భక్తులు వేలాదిగా తరలి వచ్చారు. ధ్వజస్తంభం వద్ద మహిళలు దీపారాధన చేశారు. గోవింద నామాలు స్మరిస్తూ దేవదేవుడి దర్శనానికి భక్తులు బారులు తీరారు. వేకువ జామున 4 గంటలకు ధ్వజ స్తంభ పూజ నిర్వహించారు. పెద్ద ఎత్తున సామూహిక వ్రతాలు జరిగాయి. అనివెట్టి మండపంలో కూడా ప్రత్యేక పూజలు జరిగాయి. పలువురు ప్రముఖులు స్వామిని దర్శించుకున్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఆలయ ఈవో రాజగోపాల్ రెడ్డి చర్యలు చేపట్టారు.

పంచగ్రామాల భూ సమస్యపై మంత్రి సమీక్ష



మంత్రి ఆనంతో కమిషనర్ సత్యనారాయణ, కలెక్టర్ హరేంధిర ప్రసాద్ తదితరులు

మహారాణిపేట: దేవదాయ శాఖ వ్యవహారాలతో పాటు, సింహాచలం పంచ గ్రామాల భూ సమస్యపై దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి సమీక్షించారు. సింహాచలం భూ సమస్యపై ప్రధానంగా చర్చించారు. అలాగే మాన్సాస్ ట్రస్టు భూములు, ఇతర అనుబంధ దేవాలయ అంశాలపై కూడా సమీక్షించారు. ఈ సమావేశంలో కేంద్ర మాజీ మంత్రి పి.అశోక్‌గజపతిరాజు, ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి గజపతి, దేవదాయ శాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ, కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్, సింహాచలం ఈవో వేంద్ర త్రినాథరావు, దేవదాయ శాఖ జిల్లా ఉప కమిషనర్ (డీసీ) ఎన్.సుజాత, జిల్లా సహాయ కమిషనర్లు (ఏసీ) టి.అన్నపూర్ణ, కె. శిరీష పాల్గొన్నారు.

పీజీ విద్యార్థుల అవగాహన కోసం పలు కార్యక్రమాలు

మహారాణిపేట: కమ్యూనిటీ మెడిసిన్ చదివే పీజీ విద్యార్థుల అవగాహన కోసం పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఇండియన్ పబ్లిక్ హెల్త్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఎంవీవీ మురళీమోహన్ తెలిపారు. వ్యాస రచన, వక్తృత్వ, క్విజ్ తదితర పోటీలు నిర్వహించామన్నారు. అసోసియేషన్ రాష్ట్ర నూతన కార్యవర్గ సమావేశం ఆదివారం పాండురంగాపురంలో ఉన్న ఆఫీసర్స్ క్లబ్‌లో జరిగింది. ఈ సమావేశంలో డాక్టర్ మురళీమోహన్‌రావు మాట్లాడుతూ మొదటి మూడు స్థానాల్లో నిలిచిన వారికి బహుమతులు ఇచ్చినట్లు తెలిపారు. ఒంగోలు ప్రభుత్వ వైద్య కళాశాల, అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ బి.తిరుమలరావు మాట్లాడుతూ పీజీ విద్యార్థులకు ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాల గురించి అవగాహన కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ ఉపాధ్యక్షుడు డాక్టర్ అప్పలనాయుడు, అసోసియేషన్ ఉపాధ్యక్షుడు డాక్టర్ శ్రీకాంత్ రెడ్డి, డాక్టర్ కె.కె.ప్రసాద్, జాతీయ జాయింట్ సెక్రటరీ పి.జె. శ్రీనివాస్, కోశాధికారి గంటా శ్రీనివాస్, డాక్టర్ కృష్ణబాబు, డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ శరత్, డాక్టర్ సాకేత్, డాక్టర్ పృథ్వీరాజ్ పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్య సాధనకు కృషి చేయాలి



మాట్లాడుతున్న పోలీస్ కమిషనర్ శంకబ్రత బాగ్చీ

డాబాగార్డెన్స్: విద్యార్థులు లక్ష్య సాధనకు కృషి చేయాలని పోలీస్ కమిషనర్ శంకబ్రత బాగ్చీ అన్నారు. అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఆదివారం ఆర్క్ వ్యాలీ స్కూల్ 25వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. విద్యార్థులకు తల్లిదండ్రులు లక్ష్యాలు నిర్దేశించాలని తెలిపారు. విద్యార్థులకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు మార్గదర్శకులుగా ఉండాలన్నారు. విద్యార్థులు కష్టపడే తత్వం అలవాటు చేసుకోవాలన్నారు. పితృ దేవోభవ, ఆచార్య దేవోభవ నిత్యం మననం చేసుకోవడం ద్వారా లక్ష్యం సాధించవచ్చన్నారు. సైబర్ క్రైమ్ నేరాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. స్వామి వివేకానందను స్ఫూర్తిగా తీసుకుని జీవితంలో లక్ష్యం సాధించవచ్చన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఫిల్మ్ డైరెక్టర్, నటి శుభశ్రీ ముఖర్జీ, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. సాయిలక్ష్మి, పాఠశాల కరస్పాండెంట్ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పురుషులకూ ప్రత్యేక చట్టాలుండాలి

సీతమ్మధార: పురుషులకు వ్యతిరేకంగా చట్టాలుండటం అన్యాయమని సేవ్ ఫ్యామిలీ హార్మోన్ విశాఖ జిల్లా అధ్యక్షుడు మధుసూదన్‌రాజ్ అన్నారు. జీవీఎంసీ గాంధీ పార్కులో కొవ్వొత్తులతో జరిగిన శాంతియుత నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. స్త్రీలు పెట్టిన అక్రమ కేసులతో ఎందరో పురుషులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పురుషుల కోసం పార్లమెంట్‌లో ప్రత్యేక చట్టం ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. అతుల్ సుభాష్ మోడీ భార్యతో విభేదాలు తట్టుకోలేక ఆత్మహత్య చేసుకోవటం విచారంకరమని పేర్కొన్నారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా, మహిళల అక్రమ కేసులతో ఇబ్బంది పడుతున్న వారికి ధైర్యం చెబుతామని తెలిపారు. ఆత్మహత్యలు చేసుకోకుండా ఎదిరించి బతకాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.